క్లుప్తంగా

సరదాలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

సీఐ శంకర్‌రెడ్డి



కొత్తూరు: కొత్త సంవత్సరం వేడుకల్లో భాగంగా సరదాలతో ప్రమాదాల బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా నిర్వహించే ఈవెంట్లలో పాల్గొని మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈవెంట్లు నిర్వహించే వారు అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే కొనసాగించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలు, ఈవెంట్ల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ నెల 31వ తేదీన సాయంత్రం నుంచి ఉదయం వరకు అన్ని కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు, డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు.

బోగస్ ఓట్లను తొలగించండి

శంకర్‌పల్లి: మిర్జాగూడ గ్రామంలో బోగస్ ఓట్లను తొలగించాలని కోరుతూ మాజీ సర్పంచ్ పంతం సంజీవ, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒగ్గు మల్లేశ్, మాజీ వార్డు సభ్యులు నర్సింగ్ శనివారం జిల్లా పాలన అధికారి కార్యాలయంలో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోగస్ ఓట్లు ఉండటం వల్ల గ్రామంలో ఓటింగ్ శాతం తగ్గుతుందన్నారు. నెల రోజుల క్రితం జరిగిన శాసన సభ ఎన్నికల్లో 3,999 ఓట్లు ఉండగా 2,700మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఇప్పటికైనా తగిన విచారణ చేసి బోగస్ ఓట్లను తొలగించాలని తహసీల్దార్ సురేందర్‌ను కోరారు.

వరల్డ్ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్‌లో నాలుగో ర్యాంక్

మొయినాబాద్‌రూరల్: వరల్డ్ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ ర్యాంకింగ్స్‌లో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సీఎస్‌ఈ విద్యార్థి పి వంశీకృష్ణంరాజు నాలుగో ర్యాంకు సాధించాడని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.సారధివర్మ పేర్కొన్నారు. శనివారం కేఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాంకు సాధించిన వంశీకృష్ణంరాజును అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు రాణిస్తున్నారనడానికి ఇది నిదర్శనమన్నారు. క్రిప్టో గ్రఫీ, కంప్యూటింగ్, రికనైసెన్స్ టెక్నిక్‌లో ప్రతిభ కనబరచారని అధ్యాపకులు తెలిపారు. డాక్టర్ సావాదామ్ బాలాజీ, డాక్టర్ రామకృష్ణ, సంపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందడం అభినందనీయం

మొయినాబాద్‌రూరల్: చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో పని చేస్తున్న అధ్యాపకులు కస్నూరి రాజేశ్వరి, సుదూల సుదర్శన్‌రెడ్డిలకు డాక్టరేట్ లభించడం అభినందనీయమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో పని చేస్తున్న రాజేశ్వరి రసాయన శాస్త్ర విభాగంలో 'సిద్దాసిస్ అండ్ బయాలజికల్ ఎవాల్యుయేషన్ టోమారీస్ తయాజీస్ అండ్ డైసీఫైన్' అనే అంశంపై డాక్టర్ వి.అమర్‌నాథ్ పర్యవేక్షణలో కస్నూరి రాజేశ్వరి పరిశోధన చేశారు. రసాయన శాస్త్ర విభాగంలో 'సిద్దుసిస్ క్యారెక్టరేషన్ అండ్ బయాలజికల్ యాక్టివిటీ ఆఫ్ సమ్ నావేల్ ఎటిరో సైక్లిక్ కంపౌండ్స్' అనే అంశంపై ఆచార్య జదీష్‌కుమార్ పర్యవేక్షణలో సుదూల సుదర్శన్‌రెడ్డి పరిశోధన నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి డాక్టరేట్ ప్రకటించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కులపతి పురుషోత్తమ్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, రీసర్చ్ డీన్ కిష్టఫర్, కంట్రోలర్ జగదీష్‌కుమార్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్



మట్టి లోడ్‌తో టిప్పర్

కేశంపేట: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసిన సంఘటన మండల పరిధిలోని సంగెం గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..సంగెం గ్రామ శివారులో టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడి చేరుకొని 6టిప్పర్లను గుర్తించి వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగు.. భలే బాగు



ముద్దెంగూడలో సాగు చేసిన తెల్లకుసుమ పంట

- రైతులకు అధిక దిగుబడులు
- తెల్ల కుసుమ పంటలపై ఆసక్తి
- గతం కంటే పెరిగిన విస్తీర్ణం

షాబాద్: నూనె గింజల సాగుతో రైతులకు దిగుబడులు పెరుగుతున్నాయి. మార్కెట్‌లో నూనె ధరలు పెరుగుతుండడంతో రైతులు తెల్ల కుసుమ పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఎక్కువ మంది తెల్ల కుసుమ, నల్ల కుసుమ పంటలను వేస్తున్నారు. ఈ నూనెతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వారు అధికాంగా వేస్తున్నారు. ఈ క్రమంలో తెల్ల కుసుమ సాగు విస్తీర్ణం గతం కంటే పెరిగింది. దీంతో రబీలో వీటిని సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తెల్ల కుసుమ ఉత్పత్తి తగ్గిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగదారులు మార్కెట్లో లభించే ఏదో ఒక బ్రాండ్ నూనెను వాడుకోవాల్సి వస్తుంది.

సాగుకు ప్రోత్సాహం కరువు

రబీలో పండించే నూనెగింజల్లో ప్రధాన పంట తెల్ల కుసుమ. దశాబ్దం క్రితం రైతులు వేల ఎకరాల్లో తెల్ల కుసుమ పంట వేసేవారు. ఏ ఇంట చూసినా తెల్ల కుసుమలను గానుగాడించి ఏడాదిపాటు అవసరమైన వంటనూనె నిల్వ చేసుకునే వారు. తెల్లకుసుమ పంట సాగు తరిగిపోవడంతో పరిస్థితిలో మార్పులు చోటుచేసుకున్నాయి. రబీలో నల్లరేగడి నేలల్లో పూర్తిగా లేదా అంతర పంటగా తెల్ల కుసుమ సాగు చేసేవారు. తెల్ల కుసుమను తెల్లజొన్న, శనగ పంటలో అంతర పంటగా సాగు చేసేవారు. మండలంలో పత్తిసాగు పెరగడంతో తెల్ల కుసుమకు శాపంగా మారింది. పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేసినప్పటికీ రబీ పంట కాలం ముగిసే వరకు దిగుబడులు ఇస్తుంది. దీంతో రబీసాగుకు అవరోధం ఏర్పడుతుంది. పత్తి సాగుతో ముఖ్యంగా మండల ప్రజల ఆహార పంటైన తెల్లజొన్న, శనగ సాగును తీవ్రంగా దెబ్బతీసింది. అదే సమయంలో జొన్న, శనగలో అంతర పంటగా సాగు చేసే కుసుమ పంట సాగును ప్రభావితం చేసింది. దశాబ్దం క్రితం వరకు వేల ఎకరాల్లో సాగు చేసే తెల్ల కుసుమ పంట వందల్లోకి పడిపోయింది. ప్రస్తుతం మండలంలో సుమారు 2,584 నుంచి 38,521 ఎకరాల్లో తెల్ల కుసుమ సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

రికార్డుస్థాయిలో ధరలు

తెల్ల కుసుమ సాగుకు ప్రభుత్వ పోత్సాహం లభించడంలేదు. సర్దార్‌నగర్, చేవెళ్ల మార్కెట్లో తెల్ల కుసుమ విత్తనాలు లభించడంలేదు. రైతులు తమ వద్ద నిల్వచేసి భద్రపరుచుకొన్న విత్తనాలను మాత్రమే విత్తుకోవాల్సి వస్తోంది. సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో వాటికి రికార్డు స్థాయిలో గణనీయంగా ధరలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమలు క్వింటాలుకు రూ. 8వేలు పలుకుతోంది. తెల్ల కుసుమలను కొని మరాడించి తీసిన నూనె కిలో రూ. 300లుగా ఉంది. గానుగాడించి తీసిన నూనె కొందామన్నా మార్కెట్లో లభించడం లేదు. మిల్లులో, లేదా రైతుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. వారి వద్ద సైతం డిమాండ్ మేరకు లభించడంలేదు. ఆరోగ్యానికి ఎంతో మేలైన తెల్ల కుసుమ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

మూడెకరాల్లో వేశాను



ఈ ఏడాది మూడెకరాల్లో తెల్ల కుసుమ పంటతో పాటు నల్ల కుసుమ పంటను సాగుచేశాను. గతంలో వరి పంటను సాగు చేసే వాళ్లం. ప్రభుత్వం వరి పంటకు బదులు ఆరుతడి పంటలు సాగు చేసుకోమనడంతో ఈ పంటను వేశాను. గతంలో ఏడాది పొడవునా తెల్లకుసుమ నూనె వాడేవాళ్లం. మళ్లీ అదే పంటను సాగు చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమ నూనెకు మంచి డిమాండ్ ఉంది.

-యాదవరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

నూనె గింజల సాగుచేసేందుకు ఆసక్తి



నూనె గింజల సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత 30 ఏళ్ల క్రితం ఎక్కువగా రబీ సీజన్‌లో తెల్ల కుసుమ, నల్ల కుసుమ పంటలను వేసేవారు. ఇప్పుడు పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేయడంతో మార్కెట్‌లో నూనెల ధరలు పెరుగుతున్నాయి. అందుకే నూనె గింజల సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

-కూర వెంకటయ్య, రైతు, ముద్దెంగూడ

విజేతలకు ట్రోఫీ ప్రదానం



అభిషేక్ అవెంజర్స్ టీమ్

తుక్కుగూడ: వెస్ట్‌కోస్ట్ అఫ్టిలింక్స్ కంపెనీ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో 4టీమ్‌లు పోటీపడగా ఇందులో అభిషేక్ అవెంజర్స్ టీమ్ విజేతలయ్యారు. నితేష్‌నైట్ రైడర్స్ రన్నరఫ్‌గా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన వెస్ట్‌కోస్ట్ అఫ్టిలింక్స్ ప్రాజెక్టు హెడ్ సత్యేంద్రచౌదరి విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మేము జరుపుతున్న ఈ క్రీడల్లో సిబ్బంది పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇలాంటి క్రీడలతో ప్రతీ ఒక్కరికి మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌కోస్ట్ అఫ్టిలింక్స్ ప్రాజెక్టు టీమ్ సభ్యులు అరుణ్‌కుమార్ సింగ్, అభిషేక్ కుమార్‌సింగ్, పాల్గొని గెలిచిన క్రీడాకారులను అభినందించారు.

వైద్య శిబిరాలతో పేదలకు లబ్ధి

నందిగామ: వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాలకు చెందిన ఎంతో మంది కన్హా ఆశ్రమానికి వస్తుంటారన్నారు. ఇక్కడికి వచ్చిన వారికి దగ్గు, జలుబు, జ్వరంతో పాటు కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, తబస్సు బేగం, హరికిషన్, శివకుమార్, రజిత తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రావు

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

చేవెళ్ల: లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి శ్రీదేవి అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి కేసులున్నా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. చిన్న చిన్న తగాదాలకు కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో..

చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. శనివారం 77 కేసులను వారు పరిష్కరించారు.



చేవెళ్ల: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

షాద్‌నగర్: లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, షాద్‌నగర్ కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాల గురించి పూర్తిగా అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సివిల్ కేసులు 3, క్రిమినల్ కేసులు 450, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 444, పిట్టి కేసులు 4,650 పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జి రవీంద్రసింగ్, జూనియర్ సివిల్ జడ్జి సూరజ్ సింగ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏసీపీ రంగస్వామి, సీఐ ప్రతాప్‌లింగం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ఆధునిక యంత్రాలతో రైతులకు మేలు

కొత్తూరు: వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు ఉపయోగిస్తే రైతులకు అనవసర ఖర్చులు తగ్గి లాభాలు సాధించొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాయలం శాస్త్రవేత్తలు అన్నారు. మల్లాపూర్ గ్రామంలో శనివారం రైతులకు పంటల వ్యర్థాలను తొలగించే యంత్రాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటల తర్వాత ప్రతి రైతు వ్యర్థాలను శుభ్రం చేయడానికి కూలీలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం అందుబాటులతోకి వచ్చిన యంత్రాలతో వ్యర్థాలను చిన్న ముక్కలుగా చేయడంతో పాటు భూమిలోకి కప్పే విధంగా చేయొచ్చని తెలిపారు. ఈ విధానం వలన భూమి మరింత సారవంతంగా మారుతుందన్నారు. గతంలో రైతులు పంటల తర్వాత వ్యర్థాలను కాల్చడంతో విపరీతమైన కాలుష్యం వెలువడేదని పేర్కొన్నారు. ఈ విధానానికి స్వస్తి పలికి యంత్రీకరణను వినియోగించుకోవాలని వారు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, శాస్త్రవేత్తలు రమేష్, శైలజ, రాజయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలను తొలగించే యంత్రాన్ని ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

దేవాలయాల అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా సామాజిక సేవలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లతాశ్రీ, శ్రీశైలంగౌడ్, ఎంసాని నర్సింలు, వసంతరావు, అన్నారం రఘుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక దేవాలయంలో ప్రత్యేక పూజలు

సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని గంజ్ ఆవరణలో వినాయక దేవాలయంలో బీఆర్‌ఎస్ నేత మలగారి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, వన్నాడ వెంకటేశ్‌గౌడ్, డాక్టర్ చంద్రశేఖర్, గోపాల్, ఆలయ ట్రస్టీలు శంకర్‌లాల్ లాహోటీ, భరత్, శ్యాం, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొత్తూరు: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎస్‌వీఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ విన్సంట్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తయారు చేసిన వంటలతో ఫుడ్‌ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తమ వంటకాలను పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులకు విక్రయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఇంట్లో తయారు చేసే ఆహారం వలన కలిగే ప్రయోజనాను, జంక్‌ఫుడ్‌తో వచ్చే అనర్థాలను సులువుగా అర్థం చేసుకుంటారన్నారు. పాఠశాల డైరెక్టర్ వీరమోని దేవేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విన్సంట్‌రెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, సర్పంచ్ జయమ్మ

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, సర్పంచ్ కుర్వ జయమ్మ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న చెన్నయ్య

ఆర్థిక సాయం అందజేత

కేశంపేట: బోధునంపల్లి గ్రామంలో మాల యాదయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు చొప్పున, పిప్పళ్ల శేఖర్, ఎదిరే నాగేశ్వర్‌లు రూ. 3వేలు, బీరప్ప రూ. 2వేలు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నీల పాండు, లింగారెడ్డి, బాలరాజు, యాదగిరి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయుడి కుటుంబానికి ఉపాధ్యాయ సంఘాలు ఆర్థిక సహాయం అందజేశాయి. ఆలూరులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుడాల కృష్ణకుమార్‌గౌడ్ ఈ నెల 21న రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శనివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కండ్లపల్లిలోని మృతుడి కుటుంబానికి రూ.1,08,500లు అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంఈఓ సయ్యద్ అక్బర్ మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆదుకోవడం అభినందనీయమన్నారు. టీయూటీఎఫ్ మేడ్చల్ ప్రధాన కార్యదర్శి విఠల్, ఎండీ మునీర్‌పాషా, ఎస్‌టీయూ కార్యదర్శి ఖాజాపాషా, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాహెర్‌అలీ, సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం హామీలతోనే పాలన సాగించినట్లు తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు అసత్య ప్రచారం చేసుకున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. సర్పంచ్ అజయ్‌నాయక్, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండలంలో తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఎంపిఓ నర్సింలు నాలుగు టీంలుగా గ్రామసభలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు తోలుకట్ట సత్యనారాయణ పేర్కొన్నారు. తోల్‌కట్ట గ్రామంలో ప్రజా పాలనలో ఆయన పాల్గొని దరఖాస్తులను అధికారులకు అందజేశారు. భిక్షపతి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ టీంలుగా ఏర్పడి పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకు గాను సివిల్ సప్లయ్ అధికారిణి విజయలక్ష్మి ప్రత్యేకాధికారిగా ఉన్నారు. కొందుర్గులో 3,735 అభయహస్తం దరఖాస్తులు, 232 రేషన్ కార్డులకు సంబంధించి, జిల్లేడ్ చౌదరిగూడలో 4,775 ప్రజాపాలన, 1,686 రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్లు రమేష్ కుమార్, విజయ్‌కుమార్, ఎంపీడీఓలు ఆంజనేయులు, మహేష్ బాబు, ఎంపీపీ యాదమ్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్‌లో..

షాద్‌నగర్ రూరల్: అర్హులందరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు ప్రభుత్వం ప్రజాపాలనను తీసుకొచ్చిందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. చించోడ్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఎన్నికల హామీలను అమలు చేస్తుందన్నారు. సర్పంచ్ బాలమణిదామోదర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్, ఏఓ నిషాంత్‌కుమార్, పాల్గొన్నారు.

నందిగామ: కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అప్పారెడ్డిగూడలో సర్పంచ్ జేకే నర్సింహా ఆధ్వర్యంలో ప్రజాపాలన నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుదని షాబాద్ సర్పంచ్ తమ్మలి సుబ్రమణ్వేశ్వరి రవీందర్ పేర్కొన్నారు. పోతుగల్ సర్పంచ్ ఇస్మత్‌బేగం, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఆయూబ్, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, శేరిగూడ సర్పంచ్ సత్యనారాయణ, కొండకల్ సర్పంచ్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: అభయహస్తం ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవడంలో అపోహలొద్దని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం అన్నారు. మోత్కుపల్లిలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఏఓ రాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: ప్రజాపాలనలో భాగంగా అధికారులు సహకరించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు బంటు ధనంజయ్ అన్నారు. ఇమామ్‌గూడలో ప్రజాపాలన దరఖాస్తు కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు.



షాద్‌నగర్ రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి



మొయినాబాద్: మోత్కుపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ సాయిరాం



కొత్తూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్